శ్రీదేవికి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలోని ఎంబీఏ విభాగం నుంచి సందా శ్రీదేవికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టా లభించింది. ఎంబీఏ అధ్యాపకులు ప్రొ.సంపత్ కుమార్ పర్యవేక్షణలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మహిళల కెరీర్ పురోగతిలో ఎదుర్కొంటున్న అడ్డంకులు అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు.

శ్రీరామ అక్షింతల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

సనత్‌నగర్: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ సరఫరా చేసిన శ్రీరామ స్వర్ణ అక్షింతల కలశ శోభాయాత్రను ఆదివారం నిర్వహించారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం నుంచి పారిశ్రామికవాడలోని పబ్బాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. అడుగడుగునా భక్తులు శోభాయాత్రకు పూజలు స్వాగతం పలికారు. మురారిశెట్టి సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపిచంద్, ఇతర ప్రతినిధులు, పాల్గొన్నారు.

కానుకల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న సుధీర్‌కుమార్, విల్సన్

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని సీఎస్‌ఐ సెయింట్ పాల్స్ చర్చిలో ఆదివారం పేదలకు ప్రభుత్వం అందజేసిన నూతన సంవత్సర బహుమతులను అందజేశారు. చర్చి ప్రతినిధి, సీనియర్ న్యాయవాది సీహెచ్. సుధీర్‌కుమార్, పాస్టర్ ఎం. విల్సన్ ఆధ్వర్యంలో 300 మందికి దుస్తులు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కొత్త సంవత్సరం శాంతి, సౌభాతృత్వాలతో ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మురళీ, ప్రవీణ్, సూర్యప్రకాష్, డేవిడ్, శామ్యూల్‌సైమన్, బాసా కృపానందం పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని సెయింట్ థెరెస్సా పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా సాగింది. ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి 1968–2015 మధ్య కాలంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు 300 మంది హాజరయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వారి వారి కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో చక్రధర్ యాదవ్, మాజీ కార్పొరేటర్, నిర్వాహక కమిటీ సభ్యులు కంజర్ల సదాశివయాదవ్, ధనశేఖర్‌రెడ్డి, చెంగల్వ శ్రీనివాస్, ఆనంద్‌రాజ్, రఫత్ సుల్తానా, గరికపాటి శ్రీనివాస్, లిజి, రాధిక, భాస్కర్‌రాజు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్



సనత్‌నగర్: న్యూ ఇయర్ సంబరాలతో సనత్‌నగర్ నియోజకవర్గ వీధులు ఆదివారం రాత్రి హోరెత్తాయి. కుర్రకారు ఆటపాటలు, కేరింతలతో మిన్నంటాయి. 2023కు వీడ్కోలు చెబుతూ 2024ను ఆహ్వానిస్తూ వేడుకలు నిర్వహించారు. ఏ వీధి చూసినా 'కొత్త'శోభను సంతరించుకున్నాయి. సనత్‌నగర్, అమీర్‌పేట్, ఎస్‌ఆర్‌నగర్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో నూతన సంవత్సర ఆనందోత్సావాలు వెల్లివిరిశాయి. జెక్‌కాలనీ, సుందర్ నగర్, మోడల్ కాలనీల్లోని పలు అపార్ట్‌మెంట్లలో వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో హోరెత్తించారు.

తార్నాక, లాలాపేట, శాంతినగర్‌లో..

లాలాపేట: నూతన సంవత్సరం 2024 వేడుకల కోసం వ్యాపార సముదాయాలు, ఇళ్లు, చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. చర్చిలలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు, క్రైస్తవ సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. తార్నాక, లాలాపేట, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో కేక్‌లను కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో బేకరీలు కిటకిటలాడాయి.



వయస్సు పన్నెండు.. మేధస్సు మెండు



నేత్ర సింగ్

సెయింట్ పీటర్స్ విద్యార్థిని వినూత్న ఆలోచన

టీఈడీలో ప్రదర్శించిన నేత్రసింగ్



కంటోన్మెంట్: రోబోటిక్ పెంపుడు జంతువులు..బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్ స్కూల్ విద్యార్థి వినూత్న ఆలోచన. తన సృజనాత్మక ప్రదర్శనతో పలువురి దృష్టిని ఆకర్షించింది 12 ఏళ్ల ఆరో తరగతి విద్యార్థిని నేత్ర సింగ్. బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ‘స్టార్స్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్–యాన్ ఈవెనింగ్ అండర్ ది ఓపెన్ స్కై’ కార్యక్రమం ఇందుకు వేదికైంది. టెక్నాలజీ ఎంటర్ టైన్‌మెంట్ డిజైన్ (టీఈడీ)లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను వెల్లడించారు. ఇందులో నేత్ర సింగ్ రోబోటిక్ పెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన వరేణ్య, ప్రీతమ్, శామ్యూల్ బృందం రూపొందించిన ఫైర్ అండ్ గ్యాస్ లీకేజీ రోబో సైతం పలువురి ప్రశంసలు అందుకుంది. 2024 జనవరిలో న్యూఢిల్లీలో నిర్వహించే సీఈఎస్‌ఈ రీజినల్ ఎగ్జిబిషన్‌కు ఈ ప్రదర్శనలు ఎంపికయ్యాయి.

ఏమిటీ రోబోటిక్ పెట్?

ప్రతి ఏడాది 6 లక్షల పెంపుడు జంతువులను దేశ వ్యాప్తంగా దత్తత తీసుకుంటున్నారు. అయితే పెంపుడు జంతువులను దత్తత తీసుకుని నిర్వహించడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం, అందరికి అది సాధ్యపడకపోవచ్చు. ఇందుకు ప్రత్యామ్నాయంగానే ‘రోబోటిక్ పెట్’ ఆలోచనకు శ్రీకారం చుట్టానని చెబుతున్నారు నేత్ర సింగ్. 1999లో ప్రారంభమైన ఈ పాఠశాల 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25 ఏళ్లు పూర్తి చేసుకుని సిల్వర్ జూబ్లీ లోగోను ఆవిష్కరించి సిల్వర్ జూబ్లీ సంవత్సరాన్ని జరుపుకోనుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టీపీ రెడ్డి, ప్రిన్సిపాల్ సువర్ణ పాల్గొన్నారు.

అవినీతికి మారుపేరు కాంగ్రెస్, బీఆర్ఎస్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: అవినీతికి మారుపేరుగా మారిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిప్పికొట్టాలని కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొన్ని నెలల్లో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి భారత ప్రధాని నరేంద్ర మోదీకి హ్యాట్రిక్ అందించాలన్నారు. ఆదివారం నామాలగుండులోని బీఎస్ఆర్ గార్డెన్‌లో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పాలకులు అవినీతి కార్యక్రమాలు చేపట్టారని.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి కార్యకలాపాలకు తెర లేపారన్నారు. అవినీతి రహిత పరిపాలన విధానాల అమలు కోసం బీజేపీని గెలిపించాలన్నారు. ఈ నెల 22న రామజన్మభూమిలో నిర్వహించే శ్రీరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని దేశ ప్రజలంతా వీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, వెంకటరమణి, శ్యాంసుందర్‌గౌడ్, సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, కందాడి నాగేశ్వర్‌రెడ్డి, మద్దెర్ల శ్యాంసుందర్, అంబాల రాజేశ్వర్‌రావు, కనకట్ల హరి పాల్గొన్నారు.

సేవ, ఆధ్యాత్మిక రంగాల్లో ముందంజ



ప్రమాణా స్వీకారోత్సవంలో పాల్గొన్న నేతలు

లాలాపేట: ఆర్యవైశ్య సంఘం సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక రంగాల్లో ముందజలో ఉందని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంఘం సభ్యత్వ నమోదును రూ.2 లక్షల వరకు పెంచాలన్నారు. సంఘం ద్వారా చేస్తున్నా సేవా కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించాలని సూచించారు. గత ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య సంఘానికి కేటాయించిన స్థలంలో పెద్ద ఎత్తున కల్యాణ మండపాన్ని నిర్మాణం చేస్తామని ప్రకటించారు. అంతకన్న ముందు లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు గుప్తా, కోశాధికారి యెనిశెట్టి భాస్కర్, ఇతర సభ్యులు, సలహాదారులను తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు నేతి రాములు గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు.

సమస్యల పరిష్కారానికి వినతి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

సికింద్రాబాద్: పెట్రోల్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఆరునెలలకు ఒకసారి పెట్రోల్ డీలర్ల కమీషన్ పెంచాలని 2017లో అపూర్వచంద్ర కమిటీ సిఫారసు చేసినా అప్పటి నుంచి నేటి వరకు కేంద్రం అమలు చేయలేదని వాపోయారు. స్పందించిన కేంద్ర మంత్రి తమ సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్టు పెట్రోల్ డీలర్లు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో మర్రి అమరేందర్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, సురేశ్, ఖాలిద్, బ్రిజ్‌గోపాల్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఉన్నారు.

కొత్త సంవత్సరం..కొత్త సర్కారు!

కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు కలిసొచ్చేనా?



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: పర్మనెంట్ కోసం పదేళ్లు పోరాడి అలసిపోయినా ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులకు కొత్త సంవత్సరంలో కొత్త సర్కారు పాలనలో 25 ఏళ్ల క్రమబద్ధీకరణ సమస్య తీరి వారి కుటుంబాలకు కలిసొచ్చేనా అని పలువురు సిబ్బంది సందేహం వ్యక్తం చేశారు. ఆదివారం సాక్షితో కాంట్రాక్టు అధ్యాపక నేతలు డాక్టర్ పరుశురామ్, డాక్టర్ ప్రేమయ్య మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి స్వరాష్ట్ర నేతల పదేళ్ల పాలనలో యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు మోసపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీల్లో పని చేసే కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేసి కేవలం వర్సిటీల సిబ్బందిని పక్కన పెట్టారని కొత్త ఏడాదిలో నైనా ఉద్యోగాలు పర్మనెంట్ కావాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం వాహెబ్‌నగర్, బొల్లారం ఆదర్శనగర్‌లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. అందులో భాగంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, సహాయ నిధి, ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా మేనేజర్, నోడల్ ఆఫీసర్ జీఎం. సుబ్రహ్మణ్యం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీసర్ తరుణ్‌కుమార్ బోడా, బీవీ. మనోజ్ వర్మ, కిరణ్ తేజ్ సీనియర్ మేనేజర్ పరశురామ్ కాంబ్లే పాల్గొన్నారు.

ఓయూ పూర్వ విద్యార్థులకు సన్మానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన గ్లోబల్ అలుమ్ని మీట్–2023లో పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కళాశాల అసెంబ్లీ హాల్లో అలుమ్ని అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 1956 బ్యాచ్‌కు చెందిన సివిల్ ఇంజినీరింగ్ విభాగం పూర్వ విద్యార్థులు ఐఐటీ ఢిల్లీ ప్రొ.సీతారాములు, సీనియర్ ఇంజినీర్ వి.రామకిషన్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వీసీ ప్రొ.రామచంద్రం, వీసీ ప్రొ.రవిందర్, ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, అలుమ్ని అధ్యక్షులు డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.























